06ATP27_06ATP27.qxd 22-11-2025 PM 10:44 Page 1



## పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం

**-భక్తులు, పర్యాటకులతో కిటకిటలాడిన క్షేత్రం**

ఉరవకొండ, నవంబర్ 22 ప్రభాతవార్త



లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం దృశ్యం

జిల్లాలో ప్రసిద్ధ చెందిన ఉరవకొండ మండలం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మార్గశిర విదియ శనివారం సాయంత్రం సాంప్రదాయం ప్రకారం లక్ష్మీనరసింహస్వామి పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానం కార్యనిర్వహణ అధికారి సి.ఎన్.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీర్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. మార్గశిర మాసం కావడంతో జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నింబగల్లు గ్రామంవద్ద అదుపుతప్పి బోల్తాపడ్డ ఆటో

**-నలుగురికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు**

**-ఇద్దరి పరిస్థితి ఆందోళనకరం, జిల్లా కేంద్రం తరలింపు**









ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఉరవకొండ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఉరవకొండ, నవంబర్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని నింబగల్లు గ్రామంవద్ద శనివారం ఉదయం ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నింబగల్లు గ్రామానికే చెందిన నలుగురికి తీవ్ర, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... మైలారంపల్లి గ్రామవద్ద రోడ్డు పనుల కోసం వారు ఆటోలో వెళుతుండగా గ్రామానికి కిలో మీటరు దూరంలో ఉన్నఫలంగా ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఎల్లప్ప, వెంకటేష్, చిట్టాయప్ప, సురేష్‌తోపాటు మరో ఇద్దరికి గాయాలుకాగా తీవ్రంగా గాయపడిన నలుగురికి చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇక్కడ వారికి ప్రథమ చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన ఎల్లప్ప, వెంకటేష్‌లను వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కిషోర్ బాలికల పై అవగాహన ప్రోగ్రాం

గోరంట్ల నవంబర్ 22 ప్రభాతవార్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సూపర్వైజర్

మండలంలోని వందలపల్లి ప్రభుత్వ హైస్కూల్లో శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమందేపల్లి ప్రాజెక్ట పరిధిలో సిడిపిఓ శాంత లక్ష్మి సూచన మేరకు సూపర్వైజర్ మంజుల ఆధ్వర్యంలో హైస్కూల్లో విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బాల్యవివాహాలు, పిల్లల చదువులు, పరిశుభ్రత వంటి అనేక విషయాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు అశ్వత్థ రెడ్డి, ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ జాబ్ కార్డులపై గ్రామ సభలు



అగ్రహారంలో మాట్లాడుతున్న ఎంపీడీవో దృశ్యం

అమరాపురం నవంబర్ 22 ప్రభాతవార్త

మండల పరిధిలోని వి.అగ్రహారం గ్రామ పంచాయతీ సర్పంచ్ రామప్ప అధ్యక్షతన గ్రామ పంచాయతీ భవనం నందు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభను శనివారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామారావు మడకశిర నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ రమేష్‌లు పాల్గొన్నారు. అదేవిధంగా వలస గ్రామపంచాయతీ కార్యాలయం నందు స్థానిక సర్పంచ్ జితేంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సహకార సంఘం అధ్యక్షుడు గణేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్అసిస్టెంట్ ఈరన్న, ఫీల్డ్ అసిస్టెంట్ దేవరాజ్, గ్రామ కార్యదర్శి వీరకరియప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాబ్ కార్డుల పై గ్రామసభను నిర్వహించారు. అదేవిధంగా జాబ్ కార్డ్‌ల పరిశీలన, కొత్త జాబ్ కార్డ్ లజాబితాను చదివి వినిపించడం జరిగింది. ఈ గ్రామసభలో ఈ కేవైసీలో వివిధ కారణాలతో తొలగించబడిన జాబ్ కార్డులకు సంబంధించి గ్రామ సభ ద్వారా చర్చించారు. జాబ్ కార్డు ద్వారా ప్రజలకు ప్రభుత్వం ద్వారా వచ్చే ఉపయోగాలను వివరించారు. సచివాలయం కార్యదర్శి మోహన్ రెడ్డి, వీర టెక్నికల్ అసిస్టెంట్ హనుమంతరాయ, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్ ,చివాలయం సిబ్బంది వీరుపక్షి, అబ్దుల్,మమత,మధు,వీణ, మరియు ఉపాధి హామీ శ్రామికులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బంగారు కుటుంబాలు పరిశీలించిన అధికారులు

అమరాపురం నవంబర్ 22 ప్రభాతవార్త



కుటుంబాలను పరిశీలిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని వి. అగ్రహారం గ్రామంలో ఎంపీడీవో రామారావు, మడకశిర నియోజకవర్గ విజన్ ప్లాన్ స్పెషల్ ఆఫీసర్ రమేష్ గ్రామాల్లో గ్రామపంచాయతీ సర్పంచ్ రామప్ప సమక్షంలోపి.4 కింద ఎంపికైన బంగారు కుటుంబాలను శనివారం పరిశీలించారు. ప్రభుత్వం బంగారు కుటుంబాల పై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు మరియు సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి మోహన్ రెడ్డి, వీర కరియప్ప,సచివాలయం సిబ్బంది వీరుపక్షి, అబ్దుల్,మమత,మధు,వీణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేటి నుండి అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్యాన్నదానం

మడకశిర నవంబర్ 22 ప్రభాతవార్త:



అయ్యప్ప స్వామి మూల విరాట్

స్థానిక శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నేటి నుండి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలియ జేశారు.చలపతి గురు స్వామి సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత కొన్ని సంవత్సరాలుగా మన సన్నిధానం నందు ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈసంవత్సరం కూడా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలియ జేశారు. ఈఅన్నదాన కార్యక్రమం కు సహకరిస్తున్న శాశ్వత అన్నదాన సేవా కర్తలు స్వాములు పుర ప్రజలు అందరికీ అయ్యప్ప సేవా సమితి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీ చలపతి గురుదేవుల వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 23వ తారీకు మన సన్నిధానం నందు అన్నదాన కార్యక్రమం ప్రారంభించుచున్నామని వారు తెలిపారు. ఈ రోజు ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు చలపతి స్వామిని స్మరించుకుంటూ భజన కార్యక్రమం మరియు తదుపరి అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుంది.. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరై దేవదేవుని కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నామని శ్రీ అయ్యప్ప స్వామి సేవా సమితి వారు తెలిపారు.

## ఆర్టీసీ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

వజ్రకరూరు నవంబర్ 22 ప్రభాతవార్త



రోడ్డు ప్రక్కన ఆగిన ఆర్టీసీ బస్సు

మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు సమీపంలో ప్రమాదానికి గురికావలసిన ఆర్టీసీ బస్సు డ్రైవరు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. శనివారం గుంతకల్ నుండి ఉరవకొండకు రద్దీతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు వజ్రకరూరు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆవులను తప్పించబోయి రోడ్డు ప్రక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టబోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం జరగలేదు. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్న బస్సు రహదారి పక్కనున్న విద్యుత్ స్తంభానికి తగిలి గుంతలలోకి వెళ్లి బోల్తాపడే అవకాశం ఉండేది. స్తంభాన్ని తప్పించి రోడ్డు ప్రక్కన బస్సు నిలిపివేశాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రయాణికులందరూ ఒకసారి ఊపిరి పీల్చుకున్నారు.

## మీ మీద ఉంచుకున్న ఆశలను నెరవేర్చాలి

**ఎస్వీవీఎం డిగ్రీ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు**

గోరంట్ల నవంబర్ 22 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు తల్లిదండ్రులు...

ఫ్రెషర్స్ డే వేడుకలు స్థానిక ఎస్వీబీఎం డిగ్రీ కళాశాల లో ద్వితీయ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం చెబుతూ ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమం ప్రిన్సిపాల్ భక్తవత్సలం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువలను పాటిస్తూ మీ తల్లిదండ్రులు మీ మీద ఉంచుకున్న ఆశలను ఆశయాలను నెరవేరుస్తూ ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాల ని తెలియజేశారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్ర మాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థిని విద్యార్థులు మరియు కళాశాల అధ్యాపకులు ఆజాద్, అరవింద్, నంద గోపాల్, హరీష్, కవిత, బాల మోహన్, సురేష్, నౌరీన్ తదితరులు పాల్గొన్నారు

## పశువుల గర్భకోశ వ్యాధులపై ఉచిత చికిత్స శిబిరము

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబర్ 22 ప్రభాతవార్త:



పశువుల గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యాలు





రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభి వృద్ధి సంఘం మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కొత్తచెరువు మండల పరిధిలోని నాగిరెడ్డి పల్లి గ్రామంలో శనివారం ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా పశుగణాభి వృద్ధి సంఘం కార్యనిర్వాహణాధికారి డా. జి. వెంకటేష్, కొత్తచెరువు మండల పశుసంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ మల్లేష్ పాటిల్ ,మరియు డా. జే. శ్రీకాంత్ హాజరయ్యారు. డాక్టర్ మల్లేష్ పాటిల్ మాట్లాడుతూ పాడి రైతులు ఈ ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరాన్ని ఎక్కువగా వినియోగించుకోవాలని సూచించారు. ఒక పశువు సంవత్సరానికి ఒక దూడను ప్రసవించాలంటే ఈనిన 45 రోజుల్లోపు ఎదసూది వేయడం అత్యంత అవసరం అని ఆయన తెలిపారు.అలాగే అనంతపురం ఈవో డిఎల్‌డిఏ డా. జి. వెంకటేష్ మాట్లాడుతూ రూ.500 విలువ గల లింగనిర్ధారిత వీర్యాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కేవలం పెయ్య దూడలు పుట్టే వీర్యం ప్రభుత్వం ఉచితంగా అందుబాటులో ఉంచిందని రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డా. జే. శ్రీకాంత్ మాట్లాడుతూ ఎదకు రాని పశువులు, ఎన్నిసార్లు ఎదసూది వేసినా కట్టని పశువులను శిబిరానికి తీసుకువచ్చి వైద్యం చేయించుకోవాలని రైతులను కోరారు.పశువులలో గర్భకోశ వ్యాధుల నివారణకు అవసరమైన జాగ్రత్తలు, సమతుల్య పోషణ ప్రాముఖ్యత, పచ్చిమేత మరియు సమీకృత దాణా అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా మొత్తం 48 పశువులను పరీక్షించి, రైతులకు సుమారు రూ.20 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అదనంగా, దూడలకు నట్టల నివారణ మందులను కూడా అందించారు.ఈ కార్యక్రమంలో పాడి రైతులు,ఎల్ ఎస్ ఏ జాఫర్ వలీ ఖాన్, ఏహెచ్‌ఎలు జానకిరామ్, పశుసంవర్ధక శాఖ సహాయకులు శృతి, శ్రీనివాసులు, సృజన, పవన్, నాగేంద్ర ల్యాబ్ టెక్నీషియన్ నసీమా బేగం, నిషార్ అహమ్మద్, పాల్గొన్నారు.

## ఎదురు ఎదురుగా ఆర్టిసి బస్సు బొలెరో ఢీ

**స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు**

తాడిమర్రి నవంబర్ 22 (ప్రభాతవార్త)





ప్రమాదానికి గురైన రెండు వాహనాలు

మండల పరిధిలో చిల్ల కొండయ్య పల్లి గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. స్థానికుల వివరాల మేరకు అనంతపురం నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, పార్నపల్లి నుంచి అరటి కాయల లోడుతో వెళ్తున్న బోలోరా వాహనం ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి. బస్సులో ఉన్న ప్రయాణికులు కొంతమంది స్వల్ప గాయాలతో బయటపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక ప్రజలు ఈ రహదారి నుంచి తాడిమర్రి కి వెళ్లాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది అని తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో, ఎక్కువ మలుపులు ఉండడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో తరచు వాహనాలు ప్రమాదానికి గురవుతూ ఉంటాయి అని చిల్ల కొండయ్య పల్లి ప్రజలు చెప్పడం జరిగింది. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని రోడ్డుకి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

## శిల్పారామంలో సాంస్కృతిక సంబరాలు

శ్రీ సత్య సాయి జిల్లా (వైద్యము) నవంబర్ 22 ప్రభాతవార్త



నృత్య కళతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కళాకారులు

శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ ఆదేశాల మేరకు టూరిజం శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల తో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారికి నృత్య నీరాజనం శ్రీ లలిత నాట్యకళానికేతన్, ధర్మవరం, బాబు బాలాజీ, రమ లాలిత్య వారి శిష్య బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇందులో సాంప్రదాయ నృత్య ప్రదర్శన భరతనాట్యం మరియు కూచిపూడి నృత్యం ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అందులో గజ ముఖ వందన,మహా గణపతి,అంబా పరాకు,లింగాష్టకం,పుట్టపర్తి సాయి దేవ,శివ రామ కృష్ణ, ఝునులెశబ్దం,గరుడ గమన,పలుకే బంగారం,ఘల్లు ఘల్లున,గంధము పూయ,అల్లరులు,ఆణిముత్యాలు,పుట్టపర్తి పురాణం,జయ జనార్ధన,కట్టదురా,రామ నామము లెంబ.కళాకారులు: అర్చన, ధ్రువ శ్రీ,లాస్య, పూర్వి,స్నేహ,తరుణి, ప్రేమ,సాహితి ప్రేమ,మోక్షిత, వెంకట హిమశ్రీ,ఉదయ శ్రీ, యశశ్రీ,ఆదిత్రి, దక్ష ,వేద ప్రజ్ఞ,హమీషా,రీతిమ, ఇషిక, సాయి నందన,లీలా మాధురి. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రధాన భూమిక పోషించినారని దేశ విదేశాల నుంచి వస్తున్న సాయి భక్త జనులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు శిల్పారామం ఏవో ఖాదర్ వలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

## కంప్యూటర్, క్రీడా సామాగ్రి వితరణ

బుక్కపట్నం, నవంబర్ 22, ప్రభాతవార్త

మండల కేంద్రమైన ముఖపట్నంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సౌత్ ఆఫ్రికాకు చెందిన ఆర్ముగం, వనిత, బెంగళూరుకు చెందిన చలపతి, జయలక్ష్మిలు కళాశాలకు 55000/ విలువ గలిగిన కంప్యూటర్ మరియు స్పోర్ట్స్ మెటీరియల షటిల్ బ్యాట్లు షటిల్ కాక్స్ వాలీబాల్స్ కళాశాలలోని విద్యార్థులకు బహుకరించారు. ఈ సందర్భంగా ఆర్ముగం మాట్లాడుతూ సౌత్ ఆఫ్రికా ప్రజల జీవనశైలి, వాతావరణ పరిస్థితులు అక్కడ ఉన్న విద్యా వ్యవస్థను గురించి విద్యార్థులకు తెలియజేశారు. టీఎస్ చలపతి మాట్లాడుతూ తను సాధించిన పథకాలను గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ ఎన్ రవికుమార్, అధ్యాపకులు వారిని అభినందించి దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని చరిత్ర అధ్యాపకులు డాక్టర్ వి. రాజ్ మహమ్మద్ ముందుండి నడిపించారు. తమను ప్రోత్సహిస్తూ కంప్యూటర్, క్రీడ వస్తువులు ఇచ్చినందుకు విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి ఓబులేసు, దస్తగిరి, ఆనంద్, నాగేంద్ర, భారతి, వెంకట్ నారాయణ, రామాంజనేయులు, సామకోటి శంకర మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గుత్తిలో బ్రాందీ షాపులో చోరీ

గుత్తి,నవంబర్ 22, ప్రభాతవార్త



మద్యం దుకాణం గోడకు రంధ్రం వేసిన దుండగులు

గుత్తి పట్టణంలోని గుంతకల్ రోడ్డులో ఉన్న ఎస్వీ ఎస్ మద్యం దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు నిర్వాహకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు మద్యం దుకాణం వెనక భాగంలో గోడకు రంధ్రం వేసి లోపలికి దుకాణంలోకి చొరబడి దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలు కట్ చేసి చోరీ కి పాల్పడ్డారు. మద్యం దుకాణం లోకి చొరబడిన దుండగులు ఏడు బాక్సులను దాదాపు రూ లక్ష రూపాయలు విలువ చేసే మద్యం చోరీ చేసుకు వెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు ఈ మేరకు సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జాబ్ కార్డులను సద్వినియోగం చేసుకోండి ఎపిఓ జగదీష్

గుడిబండ నవంబర్ 22 ప్రభాతవార్త





గ్రామసభలో మాట్లాడుతున్న ఎపిఓ జగదీష్

మండలంలో జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఈ కెవైసి చేసుకొని జాబ్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని ఎపిఓ జగదీష్ ప్రజలను కోరారు.ఈ సందర్భంగా మండలంలోని గ్రామపంచాయతీలలో శనివారం ఉపాధి హామీ పథకంపై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ కెవైసి చేయని జాబ్ కార్డులను తొలగించడం జరిగిందని ఎవరూ ఆందోళన చెందవద్దని అర్హులైన అవసరమైన వారు ఈ కెవైసి చేసుకొని జాబ్ కార్డులను పునరుద్ధరించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు.అలాగే జాబ్ కార్డులు కలిగిన ప్రతిఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న పనులను, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని, సోమవారం నుండి పంటకుంటలు పనులు ప్రారంభించాలని, రైతులు ఉద్యానవన పంటలను సాగు చేయాలని కోరారు.అలాగే ఈ గ్రామసభలలో మండల వ్యాప్తంగా నూతన జాబ్ కార్డుల కోసం 251 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పిల్లలపల్లి పి.ఇ.టి.జగన్ మోహన్ రెడ్డి



జగన్మోహన్ రెడ్డిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బ్రహ్మసముద్రం నవంబర్ 22 ప్రభాతవార్త

19.11.2025 న నాగార్జున యూనివర్సిటీ గుంటూరు లో జరిగిన ఆల్ ఇండియా సర్వీస్ అథ్లెటిక్స్ నందు బ్రహ్మసముద్రం మండలం,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలపిల్లల పల్లి గ్రామంలో పిఈటిగా పనిచేస్తున్న టి.జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో డిస్కస్‌త్రో మరియు లాంగ్ జంప్ పోటీలలో ప్రథమ స్థానం పొంది డిసెంబర్‌లో బీహార్ (పాట్నా)లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా పి.ఇ.టి శ్రీజగన్మోహన్‌రెడ్డి గారిని ప్రధానోపాధ్యాయులు కె.బసవరాజు గారు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ ప్రజలు అభినందించారు.

## గుండిగానిపల్లి లో యూరియా పంపిణీ చేసిన తెదేపా నాయకులు

బ్రహ్మ సముద్రం, నవంబర్ 22 ప్రభాతవార్త



యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం నియోజకవర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆదేశాల మేరకు బ్రహ్మసముద్రం మండల పార్టీ అధ్యక్షుడు పాల బండ్ల శ్రీరామలు నాచనలతో బ్రహ్మసముద్ర మండల గుండిగానిపల్లి గ్రామంలో రైతుల కళ్ళల్లో సంతోషం చూడాలని కూటమి ప్రభుత్వం అధికార యంత్రాంగం రైతులకు యూరియాను సరపర చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి కు, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నాగిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివలింగప్ప, డీలర్ కేశవర్ధన్ గౌడ్, ఐ టీడీపీ మండల అధ్యక్షుడు బజ్జన్నగౌడ, అగ్రికల్చర్ అసిస్టెంట్ వెంకటరమణ, గ్రామ కార్యదర్శి రవీంద్ర, సురేష్, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

## జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉండాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి

**-జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంభాషా**

**-చిన్నముష్టూరు గ్రామంలో ఉపాధిహామీ గ్రామసభకు హాజరు**



చిన్నముష్టూరులో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ సలీంభాషా

ఉరవకొండ, నవంబర్ 22 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉండాలంటే ఉపాధి శ్రామికులు జాబ్ కార్డులను తప్పక ఈ-కేవైసీ చేయించుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డీడబ్ల్యూఎంఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ సలీంభాషా అన్నారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రజలకు అవసరమయ్యే సేవలను గ్రామస్థాయిలోనే అందించడానికిగాను



బూదగవి గ్రామంలో జరిగిన గ్రామసభ దృశ్యం

శనివారం అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు జరుగగా మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలో జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పీడీ సలీంభాషా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో బోగస్ కూలీలను అరికట్టి నిజమైన వేతనదారులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంలో చేపట్టిన ఉపాధి కూలీల ఈ-కేవైసీ కార్యక్రమంను పకడ్బందీగా నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ-కేవైసీ ద్వారా కూలీలు పనికి వచ్చినపుడు ఒకసారి పనిచేసి పోతున్నపుడు మరొకసారి ఫేస్ యాప్‌లో హాజరు వేయాల్సి ఉంటుందన్నారు. గ్రామసభల్లో కొత్తగా జాబ్ కార్డులు, పని కొరకు ఉపాధి శ్రామికుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ-కేవైసీ సమస్యతో రద్దు, తొలగించిన జాబ్ కార్డులు మళ్లీ పరిశీలించి అర్హులైతే పునరుద్ధరించడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవి ప్రసాద్, ఏపీవో సుజాత, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "నేత"కు అండగా నిలిచిన "నేత" నిమ్మల శ్రీధర్

**మైనార్టీల సూచన మేరకు నేత కుటుంబానికి...నిమ్మల శ్రీధర్ ఆర్థిక సాయం**

గోరంట్ల నవంబర్ 22 ప్రభాతవార్త



ఆర్థిక సాయం అందజేస్తున్న నిమ్మల శ్రీధర్

పట్టణంలోని నాలుగవ వార్డులో మైనార్టీ నేత కార్మికుడు మహబూబ్ బాషా తన భార్య ముఖిమా కు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోందని కొందరు స్థానిక మైనార్టీ టిడిపి నాయకులు నేత కార్మిక నేత టిడిపి మండల నాయకులు నిమ్మల శ్రీధర్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన ఆయన ధనవంతు బాధ్యతగా ఆ మైనార్టీ నేత కార్మిక కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని నిత్యశ్రీ జ్యువెలరీ షాప్ లో నిమ్మల శ్రీధర్ టిడిపి నాయకులైన ఎర్రయ్య గారి పల్లి నీలకంఠ రెడ్డి, గోరంట్ల సొసైటీ డైరెక్టర్ నబి రసూల్, యూనిట్ ఇన్చార్జ్ కలీమ్ ఖాన్‌ల సమక్షంలో బాధ్యత కుటుంబ సభ్యులకు నగదు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆరోగ్యానికి ఆర్థిక సాయం అందజేసిన మీ సహాయాన్ని మరువలేమని బాధిత కుటుంబ సభ్యులతో పాటు టిడిపినాయకులు దాత నిమ్మల శ్రీధర్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మామిడికాయల హరి, కురుమల నరేంద్రలతో పాటు ముస్లిం మైనార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

